క్లుప్తంగా

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

బాల్కొండ: తడి, పొడి చెత్తను వేరు చేయాలని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. ఇత్వార్‌పేట్‌లో స్వచ్ఛ మిషన్‌లో భాగంగా రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి మరుగు దొడ్డి నిర్మాణం తప్పనిసరి అన్నారు. చెత్తను వేరుగా చేసి డంపింగ్ యార్డులో వేయాలన్నారు. చెత్తను ఎరువుగా తయారు చేసే విధానాన్ని వివరించారు. ప్రత్యేకాధికారి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, సర్పంచ్ సాయమ్మ, ఏపీవో ఇందిర, మహిళ సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

రెంజల్: రెంజల్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం బాలల హక్కులపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు ప్రభుత్వం అనేక హక్కులు కల్పించిందని వివరించారు. వాటిని దుర్వినియోగం చేస్తే చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో బాలల పరిరక్షణ విభాగం జిల్లా అధికారులు బాబురావ్, జమ్రుద్, నాగెల్లి బాబు, ప్రమీలారాణి, ఆరోగ్య విస్తరణ అధికారులు ర జబీదర్, శ్రావణ్ కుమార్, చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ జ్యోత్స్న పాల్గొన్నారు.

కవలల దినోత్సవం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి విజయ్ హైస్కూల్లో బుధవారం కవలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అనుజ్, తనుజ్(ఎల్‌కేజీ), నిషికంత, ఒమజా(యూకేజీ), విష్ణు, వైష్ణవి(2వ తరగతి), నివేద్, నిరుప్(4వ తరగతి), మరుత్‌వంత్, మనిత(7వ తరగతి) కవల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కవితా దివాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బోధన్‌రూరల్(బోధన్): ఎరాజ్‌పల్లిలో సీసీ రోడ్డు పనులను ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, సర్పంచ్ మంజులతో కలిసి ప్రారంభించారు. బుధవారం గ్రామంలోని సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ. 15 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరవ్వగా చిందుల ఎల్లమ్మ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు.

కళాకారులకు సన్మానం

నవీపేట: రాంపూర్ గ్రామానికి చెందిన భజన కళాకారులను సర్పంచ్ రుతు కల్పన ఆధ్వర్యంలో బుధవారం గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. జానకంపేట లక్ష్మీనర్సింహ ఆలయంలో ఇటీవల జరిగిన ఉత్సవాలతో పాటు పలు ప్రాంతాలలో జరిగిన ఆధ్యాత్మిక భక్తి భజన పాటల పోటీలలో రాంపూర్ భజన మండలి కళాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. దీంతో వారిని శాలువాలు, మెమొంటోలతో సన్మానించారు. కార్యక్రమంలో నవీపేట సొసైటీ వైస్ చైర్మన్ దొంత ప్రవీణ్ కుమార్, వీడీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ హాజరయ్యారు.

ఘనంగా రథోత్సవం



ఎడపల్లి(బోధన్): కుర్నాపల్లిలోని ఉమామహేశ్వర ఆలయంలో బుధవారం రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శివరాత్రి అనంతరం మూడవ రోజున గ్రామంలో ఉమామహేశ్వర ఆలయంలో రథోత్సవంతో పాటు జాతర నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా బుధవారం గ్రామస్తులు రథోత్సవం, జాతర నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సావిత్రి, ఆలయ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, గ్రామ పెద్దలు సాయిలు, సుమన్, సాయి రెడ్డి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా సెంట్రల్ లైటింగ్

- నిర్మాణం పూర్తి చేశారు.. కనెక్షన్ మరిచారు
- రూ.1.5 కోట్ల వ్యయంతో నిర్మాణం

నవీపేట: ఎడపల్లి మండలంలోని జానకంపేట నుంచి నవీపేట మండలంలోని ఫకీరాబాద్ వరకు రూ.55 కోట్ల వ్యయంతో బాసర రహదారిని నాలుగు లేన్లుగా విస్తరించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, అప్పటి ఎంపీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే షకీల్‌లు ఈ పనులను ప్రారంభించారు. నిర్ణీత గడువులో పనులు పూర్తి కానప్పటికీ ఆలస్యమైనా ఎట్టకేలకు పనులను పూర్తి చేశారు. నిర్మల్ జిల్లా బాసరలో గల సరస్వతిదేవి ఆలయానికి వచ్చే వారికి ఈ రహదారి సౌకర్యవంతంగా మారింది. రహదారి విస్తరణ పూర్తయ్యాక దీని పరిధిలోని అబ్బాపూర్(ఎం), అభంగపట్నం, స్టేషన్ ఏరియా గ్రామాలు నుడా పరిధిలోకి వెళ్లాయి. ఈ గ్రామాలతో పాటు మండలంలోని నవీపేట, నాగేపూర్ గ్రామాల వెంబడి ఈ రహదారి విస్తరించి ఉంది. రాత్రి వేళల్లో రహదారిపై ప్రయాణించే భక్తులు, ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్‌లకు స్థానిక నాయకులు పలుమార్లు విన్నవించారు. దీంతో స్పందించిన ప్రజాప్రతినిధులు రూ.1.50 కోట్ల వ్యయంతో సెంట్రల్ లైటింగ్‌కు నిధులు మంజూరు చేశారు.



నవీపేటలో పూర్తయిన సెంట్రల్ లైటింగ్

విద్యుత్ స్తంభాల బిగింపు పూర్తికాని ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు

రహదారి పరిధిలోకి వచ్చే అబ్బాపూర్(ఎం), అభంగపట్నం, స్టేషన్ ఏరియా, నవీపేట, నాగేపూర్ గ్రామాలలో రహదారి మధ్యలో సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులను పూర్తి చేశారు. స్తంభాల నిర్మాణం, తీగల విస్తరణ పనులను పూర్తి చేసిన అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు రూ.12 లక్షల వ్యయంతో 5 ప్రాంతాలలో ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపారు. కానీ ఇంకా నిధులు మంజూరు కాకపోవడంతో ట్రాన్స్‌కో శాఖ ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపునకు ససేమిరా అంటోంది. ఫలితంగా అందంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు అలంకారప్రాయంగా మిగిలాయి.



అబ్బాపూర్(ఎం) సమీపంలో..

ప్రతిపాదనలు పంపించాం

విద్యుత్ స్తంభాలు, కరెంట్ తీగల విస్తరణ పనులు పూర్తి చేశాం. అయిదు గ్రామాల పరిధిలో అయిదు ట్రాన్స్‌ఫార్మర్‌ల బిగింపు కోసం రూ.12 లక్షలతో కూడిన ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే ట్రాన్స్‌కో శాఖ అధికారులు విద్యుత్ సరఫరా పనులు పూర్తి చేస్తారు. ఇంకా నిధులు మంజూరు కాలేదు. – కృష్ణమూర్తి, డీఈఈ ఆర్అండ్‌బీ(ఎలక్ట్రికల్ విభాగం)

పలు అభివృద్ధి పనులకు తీర్మానం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వినీత

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అధ్యక్షతన మున్సిపల్ బడ్జెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పాలకవర్గ సభ్యులు పలు అభివృద్ధి పనులకు తీర్మానం చేశారు. 2023–24 సంవత్సరానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల అంచనా బడ్జెట్ రూ.1773.90లక్షలు అని పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, మామిడిపల్లి గ్రామాలకు మిగులు బడ్జెట్ నుంచి రూ.12.05 లక్షలు, ప్రజా సౌకర్యాల కల్పనకు రూ. 9లక్షలు, వార్డుల వారీగా రూ.15.11 లక్షలు కేటాయించారు. బడ్జెట్ సమావేశం అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ కౌన్సిలర్లు, నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్సిపల్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను, కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ మనోహర్, డీఈ భుమేష్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బీజేపీ కౌన్సిలర్లు, నేతలు

పీఆర్సీపై స్పష్టత ఇవ్వాలి

ఆర్మూర్‌టౌన్: విద్యుత్ ఉద్యోగులకు రావలసిన పీఆర్సీపై యాజమాన్యం ఎటువంటి స్పష్టత ఇవ్వలేదని ఆర్మూర్ డివిజన్ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నరేందర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మిలన్ ఫంక్షన్ హాల్‌లో విద్యుత్ ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24 నుంచి 28 వరకు విద్యుత్ ఉద్యోగులు తమ కార్యాలయాల్లో రాష్ట్ర టీఎస్పీఈ జేఏసీ పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అలాగే మార్చి 21న హైదరాబాద్‌లో నిరసన సభ, 24న అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్ నాయక్

జిల్లా ఉద్యమానికి సబ్బండవర్ణాల మద్దతు

బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని కొనసాగిస్తున్న ఉద్యమానికి ఈ ప్రాంత సబ్బండ వర్ణాల ప్రజల నుంచి విశేషంగా మద్దతు లభిస్తోందని న్యాయవాదులన్నారు. ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 66వ రోజుకు చేరాయి. దీక్షలో పట్టణ ఆటో డ్రైవర్స్ యూనియన్ సభ్యులు షేక్ ఇలియాజ్, శివ కుమార్, ఎండీ జాకీర్, ఎండీ షరీఫ్, ఎస్కే ఖయ్యూం కూర్చున్నారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.



దీక్షలో ఆటో డ్రైవర్స్ యూనియన్ సభ్యులు

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

రుద్రూర్: బొప్పాపూర్‌లో దక్షిణ ముఖ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరైన హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామికి ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులతో ప్రతిష్ఠాపన చేయనున్న దేవతామూర్తులను ఊరేగించారు. స్వామి ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. భక్తులకు ప్రవచనం చేశారు.

లక్ష్మీ నరసింహ ఆలయంలో..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో గురడి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన లక్ష్మీ నరసింహ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభించారు. కలశ స్థాపన, పుణ్యవచనం, హోమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ప్రధాన వీధుల గుండా ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆలయాన్ని అందంగా అలంకరించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



భక్తులకు ప్రవచనాలు చెబుతున్న హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి

భక్తులకు కోతుల బెడద



సావెల్‌లో పుష్కర ఘాట్ వద్ద భక్తులపైకి ఎగబడుతున్న కోతులు

బాల్కొండ: మెండోరా మండలం సావెల్ శివారులోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద కోతుల బెడద తీవ్రంగా ఉంది. దీంతో ప్రతి సోమ, శుక్రవారాల్లో గోదావరి స్నానాలకు వెళ్లే భక్తులకు తిప్పలు తప్పడం లేదు. గోదావరిలోకి వెళ్లకుండానే కోతులు పైకి వస్తున్నాయంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందలు, మందలుగా వచ్చి భక్తుల వద్ద నుంచి వంట సామగ్రిని ఎత్తుకెళ్తున్నాయి. కోతులను పట్టుకోవాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని భక్తులు వాపోతున్నారు. ఉన్నత అధికారులు స్పందించి వెంటనే కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని భక్తులు వేడుకుంటున్నారు. పంటలకు కూడా తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సావెల్ పుష్కర ఘాట్ వద్ద కోతుల వల్ల భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కోతులను పట్టుకుపోవాలి. త్వరగా చర్యలు తీసుకోవాలి. – నెల్ల లావణ్య, సర్పంచ్, సావెల్

సమాచారం..

నేడు బోధన్‌లో ఎంపీ అర్వింద్ పర్యటన

బోధన్: నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ గురువారం బోధన్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎడపల్లి మండలం ఠాణాకలాన్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ చేయనున్నారని బీజేపీ నేత మేడపాటి ప్రకాష్ రెడ్డి బుధవారం తెలిపారు. ఒంటి గంటకు బోధన్‌లోని కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించి, 2 గంటలకు పట్టణ కేంద్రంలో రైల్వే ఆర్వోబీలపై మీడియాతో మాట్లాడతారని, 3 గంటలకు రాకాసీపేటలో రైతుల సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు నవీపేట మండలంలోని నాలేశ్వర్‌లో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ఎడపల్లి మండలం జానకంపేటలో పార్టీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు.

24న లక్ష్మీ నరసింహస్వామి వార్షికోత్సవం

బోధన్‌టౌన్(బోధన్): బస్వతారక్‌నగర్ కాలనీలోని కోట మైసమ్మ సహిత లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ 11వ వార్షికోత్సవం ఈ నెల 24న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం ఉంటుందన్నారు. అతిథులుగా బాలయోగి కృష్ణ మహారాజ్, రామదాసి సురేష్ ఆత్మారాం, 108 మహంత్ సీతా రామదాస్ మహారాజ్‌లు హాజరు కానున్నారని, అతిథులుగా ఎమ్మెల్యే మహ్మద్ షకీల్, ఆయన సతీమణి ఫాతిమా హాజరు కానున్నారని తెలిపారు.

ప్రారంభానికి హైలెవల్ వంతెనలు సిద్ధం

- నేడు ప్రారంభించనున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- వేల్పూర్, మోతెలో రూ.27 కోట్లతో నిర్మాణం

వేల్పూర్: వేల్పూర్ వద్ద పెద్దవాగుపై, మోతె వద్ద కప్పలవాగుపై నిర్మాణం పూర్తయిన హైలెవల్ వంతెనలను గురువారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. వేల్పూర్ వద్ద పెద్దవాగుపై వంతెన నిర్మాణం కోసం రూ.15 కోట్లు, మోతె వద్ద కప్పలవాగుపై వంతెన నిర్మాణం కోసం రూ.12 కోట్ల నిధులను మంత్రి గత ఏడాది మంజూరు చేయించారు. ప్రయాణికులు ప్రమాదాలకు గురికాకుండా అప్రోచ్ రోడ్లకు ఇరువైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు.



మోతె వద్ద సిద్ధమైన వంతెన

తీరిన లోలెవల్ వంతెనల కష్టాలు

వేల్పూర్, మోతె వద్ద వాగులపై హైలెవల్ వంతెనల నిర్మాణంతో ఆర్మూర్, భీమ్‌గల్ రహదారిలో లోలెవల్ వంతెనల కష్టాలు తీరాయి. దశాబ్దాల కింద నిర్మించిన లోలెవల్ వంతెనలపై వర్షాకాలం వరద నీరు ప్రవహించినపుడు రెండు మండలాలకు రాకపోకలు నిలిచిపోయేవి. హైలెవల్ వంతెనలు అందుబాటులోకి రానుండటంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీధి కుక్కలతో ప్రజల్లో భయాందోళన

కమ్మర్‌పల్లి: గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని, వాటి నివారణకు అధికారులు అనుమతించాలని కమ్మర్‌పల్లి మండల ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గౌతమి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు ఇటీవల హైదరాబాద్‌లో కుక్కల దాడిలో బాలుడు మృతి చెందిన ఘటన గురించి ప్రస్తావించారు. గ్రామాల్లో కుక్కల బెడదను నివారించడానికి నిబంధనలకు లోబడి చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. వివిధ శాఖ అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. వైస్ ఎంపీపీ శేఖర్, ఎంపీడీవో సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.



సర్వ సభ్య సమావేశానికి హాజరైన సభ్యులు

రిజిస్టర్ల నిర్వహణ తీరుపై ఆగ్రహం

బాల్కొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాల రికార్డులు సక్రమంగా లేకపోవడంపై తెలంగాణ ఫుడ్ కమిషన్ చైర్మన్ తిరుమల రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మెండోరా మండలం బుస్సాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులు, చిన్నారులకు అందిస్తున్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన బియ్యం రాకపోతే ఎవరికి ఫిర్యాదు చేస్తున్నారని అడిగారు. సరైన సమాధానం రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. రిజిస్టర్ల నిర్వహణ తీరు సక్రమంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కిసాన్‌నగర్ పీహెచ్‌సీని సందర్శించారు. ఆయన వెంట డీఆర్‌డీవో చందర్‌నాయక్, తహసీల్దార్ సతీష్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, డీఎస్‌వో చంద్రప్రకాశ్, ఎంఈవో రాజేశ్వర్, ఉప సర్పంచ్ గంగారెడ్డి ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

ప్రజాపంథా పార్టీ ఆవిర్భావ దినోత్సవం



ఆర్మూర్‌లో మాట్లాడుతున్న ప్రజాపంథా నేత



బోధన్ నర్సాపూర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

జిల్లాలో పలు చోట్ల బుధవారం సీపీఐఎంఎల్ ప్రజాపంథా పార్టీ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. పార్టీ జెండాలను ఈ సందర్భంగా నాయకులు ఆవిష్కరించారు. అసమానతలు లేని సమసమాజం సాధించుకునేందుకు పార్టీ బాటలో ఉద్యమిస్తామని నేతలు అన్నారు. ప్రజా ఉద్యమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని అప్పుడే ప్రజా పోరాటాలకు ఫలితం లభిస్తుందని వ్యాఖ్యానించారు. మారుతున్న పరిస్థితులను అనుగుణంగా ఉద్యమాల సరళిని మార్చుకోవాల్సి ఉంటుందన్నారు. – సాక్షి నెట్‌వర్క్



రెంజల్ మండలం తాడ్‌బిలోలిలో..



కమ్మర్‌పల్లిలో ..

జీవాలకు నట్టల నివారణ మందులు



ఇస్సాపల్లిలో నట్టల నివారణ మందులు తాగిస్తున్న పశు వైద్యులు..



ఎడపల్లి మండల కేంద్రంలో..

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో పలు చోట్ల బుధవారం నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూగ జీవాల పెంపకందారులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా పశు సంవర్ధక శాఖాధికారులు మాట్లాడుతూ.. జీవాలకు నట్టల నివారణ మందులను తాగించడం వల్ల అంతర పరాన్న జీవులు, బాహ్య పరాన్న జీవులు నశించి జీవాలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



కమ్మర్‌పల్లి మండలం ఇనాయత్‌నగర్‌లో..

సంక్షిప్తం

దివ్యాంగుడికి చెక్కు అందజేత

బాల్కొండ: మెండోరా మండలం కోడిచర్ల గ్రామానికి చెందిన దివ్యాంగుడు సాయన్నకు ప్రభుత్వం రూ.50 వేలు మంజూరు చేసింది. సంబంధిత చెక్కును బుధవారం ఎంపీపీ సుకన్య చేతుల మీదుగా ఆయనకు అందజేశారు. ఎంపీడీవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్‌లో బుధవారం లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. టీఆర్ఎస్ నాయకులు అశ్విన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, బట్టాపురం భోజా రెడ్డి, ఇట్టెడి మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల పనుల ఉత్తర్వుల కాపీ..

మాక్లూర్: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన రూ.50 లక్షల ఉత్తర్వు కాపీలను బుధవారం మండల కేంద్రంలో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎంపీటీసీలకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, బీఆర్ఎస్ యువ నాయకుడు సందీప్‌రావు, ఎంపీటీసీలు గోవూరు ఒడ్డెన్న, పురుషోత్తంరావు, సత్యానారాయణ, కారం సుజాత, లతాశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి స్థల పరిశీలన

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని కేదారీశ్వర ఆశ్రమ ప్రాంగణంలో అయ్యప్ప ఆలయ నిర్మాణానికి బుధవారం ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహారాజ్ భక్తులతో కలిసి స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు సక్కరి రెడ్డి మాట్లాడుతూ.. సుమారు రూ.2 కోట్లతో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణంలో ప్రతి భక్తుడ్ని భాగస్వాములను చేయాలనే సంకల్పంతో విరాళాలు సేకరిస్తున్నామన్నారు. సక్కరి రెడ్డి తన వంతుగా రూ. 1,01,16లు, సీహెచ్ కొండూర్ గ్రామానికి చెందిన దేవిదాసు రూ. 51,116 చెక్కులను మంగిరాములు మహారాజ్‌కు అందజేశారు.

మండల పరిషత్ దుకాణ సముదాయం ప్రారంభం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో రూ.15 లక్షల ఎస్ఎఫ్‌సీ నిధులతో నిర్మించిన దుకాణ సముదాయాన్ని ఎంపీపీ గౌతమి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌రెడ్డి, తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ శేఖర్, ఎంపీటీసీలు అనిల్, సుధాకర్, సుప్రియ, నర్సయ్య, జ్యోతి, గంగాధర్ నాయక్, చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి అనుమతులు రద్దు చేయాలని ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని 401/38 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తూ చేపడుతున్న ఇంటి నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని పోహర్ శ్రీనివాస్ అనే వ్యక్తి బుధవారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ మనోహర్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన ఒకరు తప్పుడు డాక్యుమెంట్ ద్వారా ప్రభుత్వ స్థలాన్ని తన స్థలంగా చూపిస్తూ నిర్మాణం చేపడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.